క్లుప్తంగా

జీవనశైలి మార్చుకుంటేనే మనుగడ



ముత్తుకూరు : జీవనశైలిని మార్చుకుంటేనే భవిష్యత్తులో మనుగడ సాధ్యమవుతుందని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రాజశేఖర్ అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయంగా పంటపాళెంలో ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు 75 అంశాల్లో జీవనశైలిని మార్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం సూచించిందన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన అవసరం అవసరమన్నారు. 2028 వరకు దేశంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్, వ్యర్థ రసాయనాలతో మనిషి ఉనికికే ముప్పు ఏర్పడుతుందన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత సమాజమే ధ్యేయమంటూ పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు ప్రతిజ్ఞ చేశారు. కృష్ణపట్నం ఎడిబుల్ ఆయిల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల ఏరివేత చేపట్టారు. స్థానిక సర్పంచ్ ఆలపాక శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు రావి విజయకుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ తిన్నెలపూడి బ్రహ్మానందం, ప్రభాకరనాయుడు, ఎనిమిది ఫ్యాక్టరీల మేనేజర్లు నారాయణమూర్తి, వరప్రసాద్, విశాల్‌జైన్, గణేష్, చంద్రమౌళి, యోగానంద, మురుగన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని 84 గ్రామాల్లో స్వామిత్వ పూర్తి

మనుబోలు: జిల్లాలోని 84 గ్రామాల్లో స్వామిత్వను ఇప్పటి వరకు పూర్తి చేశామని డీపీఓ సుస్మితరెడ్డి తెలిపారు. మనుబోలులోని రెండు సచివాలయాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 722 పంచాయతీల్లో 590 పంచాయతీల్లో స్వామిత్వను ప్రారంభించామని తెలిపారు. తొలివిడతలో 84 గ్రామాల్లో పూర్తి చేసినట్లు చెప్పారు. 32 గ్రామాల్లో డ్రోన్లతో ఇంటి హద్దులను సర్వే చేసి గుర్తించి వాళ్ల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. యూనిక్ కోడ్లతో రిజిష్టర్ చేసి కార్డులు ఇస్తామని తెలిపారు. ప్రతిరోజూ సచివాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు స్పందన నిర్వహించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసి పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె వెంట సర్పంచ్ కంచి పద్మమ్మ, ఉపసర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆక్రమిత శ్మశాన భూమి స్వాధీనం

తోటపల్లిగూడూరు: ఓ రియాల్టర్ ఆక్రమించిన శ్మశాన భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం పంచాయతీలకు సంబంధించి పోలీస్‌స్టేషన్ ఎదురుగా 441ఏ సర్వే నంబర్‌లో 3.91 ఎకరాల శ్మశాన స్థలం ఉంది. ఈ భూమిని అనుకుని ఉన్న సర్వే నంబరు 446లోని 3.70 ఎకరాల్లో ఇటీవల సురేంద్ర అనే వ్యక్తి లేఅవుట్ వేశాడు. ఈ క్రమంలో శ్మశానానికి చెందిన 87 సెంట్లను తన లేఅవుట్‌లో కలుపుకొని ప్రహరీ నిర్మించాడు. లేఅవుట్‌లో ప్లాట్లను ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించాడు. శ్మశానం ఆక్రమణ విషయాన్ని తోటపల్లిగూడూరు, ఇస్కపాళెం పంచాయతీలకు చెందిన పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానిక రెవెన్యూ అధికారులు సంబంధిత రియల్ ఎస్టేట్ వ్యాపారికి నోటీసులు ఇచ్చారు. ఆక్రమణలోని శ్మశాన భూమిని వెంటనే విడిచిపెట్టాలని హెచ్చరించారు. అయినా అతని నుంచి సరైన స్పందన రాకపోవడంతో ఇన్‌చార్జి తహసీల్దార్ శివయ్య, ఆర్‌ఐ సునీల్ తమ సిబ్బందితో కలిసి బుధవారం వెంచర్ వద్దకు వెళ్లారు. ప్రహరీని జేసీబీతో ధ్వంసం చేసి శ్మశాన స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు.

చిన్నారి మృతిపై విచారణ

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ పరిధిలోని సన్‌షైన్ ఆస్పత్రిలో వైద్యం వికటించి చిన్నారి మృతి చెందిన ఘటనపై జిల్లా నోడల్ ప్రోగ్రాం ఆఫీసర్ దయాకర్ బుధవారం విచారణ చేపట్టారు. వివరాలు..దగదర్తికి చెందిన రాధాకృష్ణయ్య, కవిత దంపతుల కుమార్తె తనిష్త్రీ(4). ఇటీవల బుచ్చిరెడ్డిపాళెం మండలం రామచంద్రాపురంలో నివాసం ఉంటున్న తాత వద్దకొచ్చింది. ఈ నెల 23న పాపకు కడుపునొప్పి రాగా సన్‌షైన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడి వైద్యుడు సుబ్బారెడ్డి వైద్యపరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపించారు. కొద్దిసేపటి తర్వాత పాపకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో మళ్లీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ సమయంలో డాక్టర్ సుబ్బారెడ్డి, ఆరోగ్య సిబ్బంది కలిసి పాపకు ఇంజక్షన్లు, సెలైన్లు ఇచ్చారు. దీంతో చిన్నారి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన ఆస్పత్రి సిబ్బంది డాక్టర్‌కు విషయం తెలుపగా వారు హుటాహుటిన చిన్నారి తల్లిదండ్రుల సహకారంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పాపను పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేపట్టామని, మోతాదుకు మించి ఇంజక్షన్లు, సెలైన్లు ఇవ్వడం వల్లే వైద్యం వికటించి చిన్నారి మృతి చెందినట్లుగా తేలిందని నోడల్ ఆఫీసర్ చెప్పారు. డాక్టర్ పరారీలో ఉన్నారని తెలిపారు. ఆయన వెంట కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ బ్రిజిత, జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యుడు అహ్మద్ బాబు, తదితరులు ఉన్నారు.

ప్రజలకు సేవలు చేరువ చేస్తా

- సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు
- త్వరలో కాల్ సెంటర్ ఏర్పాటు

'సాక్షి' ఇంటర్వ్యూలో కమిషనర్ వికాస్ మర్మత్



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): సుదీర్ఘ చరిత్ర కలిగిన నెల్లూరు నగరపాలక సంస్థకు నాలుగో ఐఏఎస్ అధికారిగా కమిషనర్ వికాస్ మర్మత్ వచ్చారు. అనేక మార్పులకు శ్రీకారం చుట్టిన ఈయన వేకువజామునే వీధుల్లోకి వెళ్లి పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు. పన్నులు చెల్లించకుండా కాలం గడిపేస్తున్న సంస్థల వద్దకు స్వయంగా వెళ్లి చెల్లించాలని పట్టుబడుతున్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన 43 రోజుల్లోనే అనేక అంశాల్లో మార్పులు తీసుకొచ్చిన ఆయన తన చాంబర్‌లో సాక్షితో బుధవారం మాట్లాడారు.

సాక్షి: నగరంలో పారిశుధ్య మెరుగునకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

కమిషనర్: కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రోజూ ఉదయం ఆరు నుంచే నగరంలోని అనేక ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్నాను. ఎక్కడైతే పారిశుధ్యం అధ్వానంగా ఉందో అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నాం. మరోసారి తనిఖీ చేసే సమయంలోనూ పరిస్థితి ఇలానే ఉంటే చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే కొందరికి షోకాజ్ నోటీసులను జారీ చేస్తున్నాం. గతంతో పోలిస్తే పారిశుధ్యం ప్రస్తుతం మెరుగుపడింది.

సాక్షి: వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు సేవలు ఏ మేరకు అందుతున్నాయి..?

కమిషనర్: వార్డు సచివాలయ వ్యవస్థతో సేవలు ప్రజలకు త్వరగా అందుతున్నాయి. దీంతో కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సిన అవసరం లేకుండా పోయింది. సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నా. అక్కడ ఏమైనా లోపాలున్నా.. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించకపోయినా వెంటనే చర్యలు చేపడుతున్నా. వార్డు కార్యదర్శుల ద్వారా ప్రజలకు అవసరమైన సేవలను త్వరితగతిన అందిస్తున్నాం.

సాక్షి: కార్పొరేషన్‌కు ఆదాయ వనరులు అధికంగా ఉన్నాయి. వీటిని ఎలా రాబట్టనున్నారు..?

కమిషనర్: ఇంటి, ఖాళీ స్థలాల పన్ను, యూజర్ చార్జీలు, తదితరాలను అధికారులు, సిబ్బంది వసూలు చేస్తున్నారు. మొండి బకాయిదారుల వద్దకు నెల్లో నాలుగు సార్లు నేనే స్వయంగా వెళ్లి వసూలు చేస్తున్నాం. పన్నులను ప్రణాళికబద్ధంగా వంద శాతం వసూలయ్యేలా చూస్తున్నాం. యూజర్ చార్జీగా రూ.90 వసూలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ప్రజల నుంచి స్పందన అంతగా లేకపోవడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ మొత్తాన్ని రూ.40కు తగ్గించేలా ప్రభుత్వం నుంచి అనుమతి పొందాం. గతంలో యూజర్ చార్జీలకు సంబంధించి నెలకు రూ.తొమ్మిది లక్షలు వసూలయ్యేవి. ప్రస్తుతం ఇది రూ.27 లక్షలకు చేరింది. రూ.40 లక్షలు వసూలయ్యేలా యత్నిస్తున్నాం.

సాక్షి: జగనన్న కాలనీలు, నాడు – నేడు పనుల పురోగతి ఎలా ఉంది..?

కమిషనర్: జగనన్న కాలనీలు, నాడు – నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించాం. నగరపాలక సంస్థ పరిధిలోని జగనన్న కాలనీల్లో 18 వేల ఇళ్లు ఉన్నాయి. వీటిని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనున్నాం. నాడు – నేడు ద్వారా మున్సిపల్ పాఠశాలల్లో పనులను స్కూళ్ల పునఃప్రారంభానికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం.

సాక్షి: మరింత మెరుగైన సేవలందించేందుకు ఏమైనా ప్రణాళికలు రూపొందిస్తున్నారా..?

కమిషనర్: నగరపాలక సంస్థ అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కమాండ్ కంట్రోల్ భవనాన్ని నిర్మిస్తున్నాం. ఈ భవనం మరో నెల్లో పూర్తి కానుంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరు నగరపాలక సంస్థలో కాల్ సెంటర్‌ను రూ.ఆరు కోట్లతో నూతనంగా ఏర్పాటు చేయనున్నాం. దీని ద్వారా సమస్యపై ఫోన్ చేసిన వెంటనే తక్కువ సమయంలో పరిష్కారం లభించేలా చర్యలు చేపట్టనున్నాం. ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.

సాక్షి: మీ కుటుంబ నేపథ్యం..

కమిషనర్: మాది రాజస్థాన్‌లోని జైపూర్. తండ్రి జశ్‌రామ్ మర్మత్ ప్రభుత్వోద్యోగి, అమ్మ విమల గృహిణి. చెల్లెలు ఎంబీబీఎస్ చదువుతోంది. సేవ చేయడమంటే చాలా ఇష్టం. అందుకే సివిల్స్ వైపు వచ్చా. చిన్నతనం నుంచే అన్ని తరగతుల్లో మంచి మార్కులు తెచ్చుకునేవాడ్ని. పియానో వాయిస్తాను. 'వేర్ డూ యూ ఫాల్ అపార్ట్' అనే పుస్తకాన్ని కూడా రాశా.

నేత్రదానం



రుక్మిణమ్మ (ఫైల్)

నెల్లూరు(బారకాసు): నగరంలోని రేబాలవీధికి చెందిన రుక్మిణమ్మ (85) బుధవారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను ఏసీఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన మోటివేటర్ బాలాజీసింగ్, ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నిషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

లింక్ రోడ్డును నిర్మించాలని వినతి

నెల్లూరు రూరల్: పెద్దచెరుకూరు నుంచి తోటపల్లిగూడూరు మండలంలోని చిన్న చెరుకూరుకు లింక్ రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరారు. ఈ మేరకు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి నగరంలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అర్జీలపై తగు చర్యలు చేపట్టండి



నెల్లూరు(బారకాసు): స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. స్పందన అర్జీలపై స్టోన్‌హౌస్‌పేట, మాగుంట లేఅవుట్, ఫతేఖాన్‌పేట, ట్రంక్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. అనంతరం అర్జీదారులతో మాట్లాడారు.

డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలి

ప్రతి దుకాణం వద్ద డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. 18వ డివిజన్లోని శానిటేషన్ మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. పారిశుధ్య సిబ్బంది హాజరును పరిశీలించి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన వారికి నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. హరనాథపురం, ముత్తుకూరు రోడ్డు, సర్వేపల్లి కాలువ, రామలింగాపురం అండర్ బ్రిడ్జి, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను పరిశీలించారు. కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పేర్కొన్నారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బాలరామాయణ సప్తాహం



నెల్లూరు(బృందావనం): నైతిక విలువలకు పునాది శతక సాహిత్యమేనని కవి, పండితోపన్యాసకుడు శిరోమణిశర్మ పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్‌కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో బాలరామాయణం, నామరామాయణ సప్తాహాన్ని నిర్వహిస్తున్నారు. అరణ్యకాండ, దాశరథి శతకంలోని శ్లోకాలను ఆలపించి, బాలలతో వల్లె వేయించారు. శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రైతుబజార్ సబ్ స్టేషన్ పరిధిలోని పెన్నార్, బోడిగాడితోట ఫీడర్లలో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- డీఎస్సార్ హాస్పిటల్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ జెడ్పీ కాలనీ ఫీడర్‌లో విద్యుత్ టవర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో నేతాజీనగర్, పొదలకూరు రోడ్డు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ఐఈఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

బైక్ నుంచి పడి వృద్ధురాలికి గాయాలు

నెల్లూరు సిటీ: బైక్‌పై నుంచి పడటంతో వృద్ధురాలు గాయపడిన ఘటన నగరంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నవలాకులతోటకు చెందిన జయలక్ష్మి తన మనవడితో కలిసి బైక్‌పై గూడూరులోని బంధువుల ఇంటికి బుధవారం వెళ్లారు. తిరిగొస్తుండగా, బాలాజీనగర్ సమీపంలోని జాతీయ రహదారిపై బైక్‌పై నుంచి కిందపడ్డారు. గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గంలో పేదలు నివసించే ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 18వ డివిజన్లోని గోమతినగర్‌లో గల సర్వేపల్లి కాలువ కట్ట ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులకు అందజేస్తున్నామని వివరించారు. స్థానిక సమస్యలను ఎంపీకి పలువురు తెలియజేయగా, వీటిని పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మర్రిపాడు జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, నేతలు హరిబాబుయాదవ్, కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ అశోక్, శివసునీల్, తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రబాబుకు సత్కారం



నెల్లూరు (టౌన్): నగరంలోని కేఎన్నార్ మున్సిపల్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నరేంద్రబాబును సత్కరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో బాల సాహిత్య సమ్మేళన కార్యశాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి రోజు బుధవారం నిర్వహించిన బాల సాహిత్యం నాడు – నేడు చర్చా గోష్టిలో ప్రాతినిధ్యం వహించిన ఆయన్ను సత్కరించారు. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, శాంతా బయోటెక్ అధినేత వరప్రసాద్, బాల సాహితీవేత్త శ్రీనివాసరాజు, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణాచారి, తదితరులు పాల్గొన్నారు.

కోటంరెడ్డి సోదరులవి రాజకీయ డ్రామాలు



మాట్లాడుతున్న వెంకయ్య

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి తమ స్వార్థ ప్రయోజనాలే లక్ష్యంగా మతాల మధ్య చిచ్చుపెట్టేలా రెచ్చగొడుతున్నారని రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు రవి ధ్వజమెత్తారు. నగరంలోని ఎంపీ ఆదాల నివాసంలో విలేకరులతో బుధవారం వారు మాట్లాడారు. క్రైస్తవులు, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. వీరిపై కోటంరెడ్డి సోదరులు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధుల మంజూరు పేరిట పలువుర్ని తప్పుదోవ పట్టించడం బాధాకరమని చెప్పారు. మతాల పేరిట నియోజకవర్గంలో రాజకీయాలు చేస్తూ పబ్బం గడుపుకొన్నారని, ఈ డ్రామాలకు కాలం చెల్లిందన్నారు.

విద్యా కానుకను జాగ్రత్తగా భద్రపర్చాలి



ఉషారాణికి సత్కారం

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేయనున్న జగనన్న విద్యా కానుకకు సంబంధించిన వస్తువులను జాగ్రత్తగా భద్రపర్చాలని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి పేర్కొన్నారు. నగరంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో జిల్లాలోని అన్ని మండలాల మెసెంజర్లతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పాఠశాలల ప్రారంభం నాటికి విద్యాకానుక వస్తువులను చేర్చాలని చెప్పారు. అనంతరం పలు సమస్యలను మెసెంజర్లు తెలియజేశారు. ఏపీసీ ఉషారాణిని సత్కరించారు. అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుధీర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల వారికి సీఎం సహాయనిధి చెక్కులను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి నగరంలోని తన నివాసంలో బుధవారం అందజేశారు. ఆరోగ్య సంబంధిత సమస్యలతో బాధపడుతున్న నలుగురికి రూ.3.55 లక్షల మేర చెక్కులను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వైద్య రంగానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను త్వరలో అందజేయనున్నానని వివరించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు సిటీ: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నగరంలోని సర్వోదయ కళాశాల మైదానంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సర్వోదయ కళాశాల మైదానంలో స్థానికులు వాకింగ్ చేస్తుండగా, గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. మృతుడికి 60 ఏళ్లు ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ రంగుపై తెల్లనక్షత్రాలు కలిగిన లుంగీని ధరించి ఉన్నారు. చిన్నబజార్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింహపురిలో బిచ్చగాడు



మాట్లాడుతున్న విజయ్ ఆంటోనీ

నెల్లూరు సిటీ: నగరంలోని ఎం – 1 థియేటర్స్‌లో బిచ్చగాడు హీరో విజయ్ ఆంటోనీ బుధవారం సందడి చేశారు. ప్రేక్షకులతో ముచ్చటించారు. బిచ్చగాడు – 3ను సైతం నిర్మించనున్నామని తెలిపారు. తనను ఆదరిస్తున్న వారికి కృతజ్ఞతలను తెలియజేశారు. విజయ్ ఆంటోనీతో సెల్ఫీలు తీసుకునేందుకు పలువురు ఎగబడ్డారు.

'జగనన్నకు చెబుదాం'పై అశ్రద్ధ తగదు



మాట్లాడుతున్న హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం'లో వచ్చే అర్జీలను సక్రమంగా పరిష్కరించాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు చేపడతానని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. జగనన్నకు చెబుదాం అర్జీల పరిష్కారంలో ప్రగతిపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పది రోజుల్లో 676 అర్జీలు నమోదు కాగా, పరిష్కారానికి గడువు దాటినవి లేవని, ఇది మంచి పరిణామమని చెప్పారు. 24 గంటలు.. 48 గంటల్లో పరిష్కారం కావాల్సినవి సున్నాగా ఉండాలని చెప్పారు. రోజూ మూడుసార్లు గ్రీవెన్స్ పోర్టల్‌ను పరిశీలించాలని అధికారులకు సూచించారు. రీ ఓపెన్ కేసులు పెరగకుండా చూడాలన్నారు. గత వారం రీ ఓపెన్ కేసులు 49 ఉండగా, ఈ వారానికి 60కు పెరిగాయని తెలిపారు. సక్రమంగా పరిష్కారం చూపకపోతే క్రమశిక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. ఇంక్రిమెంట్‌ను కట్ చేయడంతో పాటు హెచ్‌ఓడీలపై ప్రభుత్వానికి నివేదికను ఇస్తామని వివరించారు. ఒక శాఖకు సంబంధించిన పిటిషన్ మరో శాఖకు వస్తే దాన్ని సంబంధిత శాఖకు బదిలీ చేయాలన్నారు. గ్రామ సచివాలయాలను లక్ష్యం ప్రకారం సందర్శిస్తున్నారాననే అంశంపై సమీక్షించారు. సందర్శించని అధికారులపై నివేదిక ఇవ్వాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను 45 రోజుల్లో పూర్తి చేయాలని పేర్కొన్నారు. జేసీ కూర్మనాథ్, సబ్ కలెక్టర్ శోభిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో ఉండాలి

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ప్రథమ స్థానంలో రాష్ట్రం మూడేళ్లుగా నిలిచిందని, ఈ ఏడాదీ సాధించేలా అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని కలెక్టర్ హరినారాయణన్ సూచించారు. కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత సమావేశ ఉద్దేశాన్ని పరిశ్రమల శాఖ మేనేజర్ మారుతి ప్రసాద్ వివరించారు. ఇరిగేషన్ ఎస్‌ఈ కృష్ణమోహన్, ఎల్డీఎం శ్రీకాంత్ ప్రదీప్, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, ఆర్టీఓ మురళీమోహన్, డీపీఓ సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాల ఢీ

నెల్లూరు సిటీ: జాతీయ రహదారిపై వాహనాలు ఢీకొన్న ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల జిల్లాకు చెందిన ఆరిఫుల్లా సహచరులతో కలిసి కంపెనీ పని నిమిత్తం విజయవాడ నుంచి కుప్పానికి ట్రావెల్స్ బస్సులో బయల్దేరారు. ఈ క్రమంలో ఎన్టీఆర్‌నగర్‌లోని ఎస్వీజీఎస్ కళాశాల సమీపంలో గల జాతీయ రహదారిపై ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ బస్సు వెనుక భాగాన్ని ఢీకొంది. దీంతో బస్సు, లారీని పక్కన నిలిపి డ్యామేజీపై లారీ డ్రైవర్‌తో ఆరిఫుల్లా మాట్లాడసాగారు. ఈ క్రమంలో మరో లారీ ఈ వాహనాలను ఢీకొంది. దీంతో ఆరిఫుల్లాపైకి బస్సు రావడంతో స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.